స్థాపితం : 1930
LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM
స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి




# జమీన్ రైతు

సంపుటి : 80 సంచిక : 30 10-7-2009 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-




### ఆపరేషన్ ఆకర్షకు ఆదిలోనే అపశృతులు...

## వికటిస్తున్న వ్యూహం!

తాంత్రిక పూజావిధానంలో మంత్రం ఎదురు తిరగడమనే ప్రమాదం ఒకటి వుందని చెప్తారు. దాన్ని పఠించే తాంత్రికుడు తప్పు చేస్తే, ఎదుటి వాడికి గురి పెట్టిన మంత్రం ఎదురు తిరిగి మాంత్రికుడిని కాటేస్తుందని చెప్తుంటారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపల ప్రతిపక్షాలను రెక్కలు విరిగిన పక్షులుగా మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన ఆపరేషన్ ఆకర్ష విషయంలో అదే జరుగుతున్నదిప్పుడు.

చరిత్రలో ఎప్పుడూలేని రీతిలో, శాసనసభ ఎన్నికలు ముగిసిన మరుక్షణం నుంచి 2014 ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభించాడు ముఖ్యమంత్రి. తొట్టతొలి క్యాబినెట్ సమావేశంలోనే మంత్రులందరికీ లక్ష్యాలు నిర్దేశించాడు. వచ్చే శాసనసభలో కాంగ్రెస్ తప్ప మరొక పార్టీకి సీట్లు దక్కకూడదని, ఎవరి జిల్లాలలో ఆ మంత్రులు అన్ని సీట్లు గెల్చుకొని రావాలని ఆజ్ఞాపించాడు. అందుకు నాందీగా స్థానిక సంస్థల ఎన్నికలలో తమ శక్తి నిరూపించాలని షరతు పెట్టాడు. అందుకోసం మంత్రులను జిల్లాలకు సర్వాధికారులను చేశాడు. కలెక్టర్లు, ఎస్పీలు మంత్రులు చెప్పినట్టల్లా ఆడాలని బహిరంగంగా హుకుం చేశాడు. జిల్లాల వారీగా జరుపుతున్న సమీక్షలలో ఇదే అంశాన్ని పదే పదే ఒత్తి చెప్తున్నాడు. మీ జిల్లాలో మొన్నటి ఎన్నికలలో ఆ నలుగురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎందుకు గెలిచారని నిలదీస్తున్నాడు. ఈ ఒత్తిడికి మంత్రులు ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. హడలి చస్తున్నారు.



స్థానిక సంస్థలకు ఇంకా చాలా వ్యవధి వుంది. మునిసిపల్ ఎన్నికలు 2010లో, జిప, మండలాలు 2011లో జరగాలి. కానీ ముఖ్యమంత్రి ఇప్పటి నుంచే వాటికి సిద్ధంకమ్మని పార్టీ యంత్రాంగాన్ని పురమాయిస్తున్నాడు. అందులో భాగమే ఆపరేషన్ ఆకర్ష. ఏ ఏ మండలాలు, గ్రామాలు, నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా వుందో గమనించి, అక్కడ పార్టీని బలోపేతం చేయడానికి ఆయా ప్రాంతాలలోని ఇతర పార్టీల ముఖ్యులను కాంగ్రెస్‌లోకి తీసుకొని రావడం ఈ ఆపరేషన్ లక్ష్యం. ముఖ్యమంత్రి మెప్పు పొందడానికి మంత్రులందరూ తమ తమ జిల్లాలలో తెలుగుదేశం, టిఆర్ఎస్ పార్టీల నుంచి అన్నిస్థాయి నాయకులకు వలలు విసురుతున్నారు. ఏ బిస్కెట్ విసిరితే ఎవరు మచ్చిక అవుతారో కనిపెట్టి, దాన్ని ప్రయోగిస్తున్నారు. అదిలాబాద్ జిల్లా శాసనసమండలి సభ్యుడు ప్రేమసాగర్‌రెడ్డి ఈ విషయంలో అందరికంటే ఒక అడుగు ముందుకు వేశాడు. తన జిల్లాకు చెందిన 12 మంది తెలుగుదేశం జడ్పీటిసి సభ్యులను ఒకేసారి కాంగ్రెస్‌లోకి తీసుకొని వచ్చాడు. ముఖ్యమంత్రి ఇంట్లో, ముఖ్యమంత్రి చేతనే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పించాడు. ప్రేమసాగర్‌రెడ్డి బాగా డబ్బున్న రాజకీయవాది. ఆ జిల్లాలో మొన్నటి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఒకే ఒక స్థానంలో మాత్రమే గెలిచింది. తతిమా అన్ని సీట్లు టిడిపి, టిఆర్ఎస్

తరువ 14వ పేజీలో

## అయ్యోపాపం డిఎస్!

రెండు నెలల క్రితం ఆయన కలలు ముఖ్యమంత్రి పీఠం చుట్టూ అల్లుకొని వుండినాయి. తెలంగాణా కోటా క్రింద తనకు అదృష్టం పడుతుందన్న ఆశతో, అంచనాతో ముఖ్యమంత్రిని కూడా మువ్వెంత అన్న తీరులో చూశాడు. కానీ ఇప్పుడు పరిస్థితి తలక్రిందులు. అదే ముఖ్యమంత్రి దయాదాక్షిణ్యాల మీద అత్యంత దయనీయంగా బ్రతకవలసిన దుర్గతి. పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ పరిస్థితి చూసిన వారికెవరికైనా అయ్యో పాపం అన్పించడం సహజం. తానే స్వయంగా శాసనసభ ఎన్నికలలో ఓడిపోవడంతో డిఎస్ రాజకీయ ప్రాభవం గాలి తీసిన బెలూన్ వలె మారిపోయింది. కేవలం వైఎస్ దయతో ఈ పదవి నిలుపుకొని వున్నాడు. పిసిసి అధ్యక్షుడి హోదాలో రాష్ట్రంలోని ఏ జిల్లాకు వెళ్లినా కాంగ్రెస్ వాదులు గొడవలు సృష్టించి, గందరగోళం చేస్తుండడంతో ఆయన పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లుంది. విజయనగరం, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలన్నిటిలో ఇదే పరాభవం ఎదురైంది ఆయనకు. పుండు మీద కారం చల్లినట్లు, పత్రికల వాళ్లు "మీరెక్కడకు వెళ్తే అక్కడ కాంగ్రెస్‌లో గొడవలు ఎందుకు జరుగుతున్నాయని" ప్రశ్నిస్తుండడంతో దీనంగా ముఖం పెడుతున్నాడు.



సరిగ్గా పదిహేనేళ్ల క్రితం అప్పటి పిసిసి అధ్యక్షుడు మజ్జి తులసీదాస్‌కు ఇదే చేదు అనుభవం ఎదురైంది. పిసిసి హోదాలో ఆయన ఏ జిల్లాకు వెళ్లినా కాంగ్రెస్‌వాదులు ఆయన సమక్షంలోనే తన్నుకొనేవారు. నెల్లూరు జిల్లాలో ఆనం సంజీవరెడ్డి, అంకయ్యగౌడ్‌ను కొట్టబోయాడు. తిరుపతిలో అదే పరిస్థితి. విజయవాడలో అయితే తలలు పగిలాయి. ఈ గోల భరించలేక రాష్ట్ర పర్యటన మానుకొని హైదరాబాద్ వచ్చేశారాయన. మళ్లీ జిల్లాలకు వెళ్లే అవకాశం లేకుండా పదవి పోగొట్టుకొన్నాడు. డిఎస్‌కు కూడా అదే చేదు అనుభవం తప్పదా అన్నది పరిశీలకుల వూహ. ఎంతటివాడు ఎంతలో ఎంత చిన్నబోయాడో అని అందరూ జాలి పడుతున్నారు - డిఎస్‌ను చూసి.

## సంక్షోభంలో తెలుగుదేశం!

**దాదాపు ప్రతిజిల్లాలోనూ ఒక కీలక తెలుగుదేశం నేతను బయటకు తేవడం ద్వారా ఆ పార్టీని చిన్నాభిన్నం చేయాలన్న వైఎస్ ఆలోచనను బాబు ఎదుర్కోలేకపోతున్నాడు.**

పార్టీ ఫిరాయింపుల గందరగోళం ద్వారా చంద్రబాబు నాయుడును మానసికంగా దెబ్బ తీయడంలో సఫలీకృతుడౌతున్నాడు ముఖ్యమంత్రి వైఎస్. తెలుగుదేశం పార్టీని సంక్షోభంలోకి నెట్టడంలోనూ విజయం సాధించాడు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో మొదలైన ఈ ప్రయోగం ఇప్పుడు దాదావు పాతిక మంది తెలుగుదేశం ఎమ్మెల్యేలకు వల విసిరే స్థాయికి చేరుకొన్నది. దాదాపుగా ప్రతి జిల్లాలోనూ ఒక కీలక తెలుగుదేశం నేతను బయటకు తేవడం ద్వారా ఆ పార్టీని చిన్నాభిన్నం చేయాలన్నది ఆలోచన. ఈ దాడిని తిప్పి కొట్టడం సంగతి దేముడెరుగు, ఆత్మరక్షణ కూడా సాధ్యం కాక, అయోమయంలో పడిపోతున్నాడు చంద్రబాబు.

కనీసం పాతికమంది తెలుగుదేశం నేతలు ఇప్పటికిప్పుడు కాంగ్రెస్‌కు వలస వెళ్లే ప్రయత్నంలో వున్నారని అంచనా. హైదరాబాద్ సిటీ నేత తలసాని శ్రీనివాస్‌యాదవ్ సృష్టించిన రభస తెలిసిందే. త్వరలో జరగనున్న హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో మేయర్ పదవి ఇచ్చే హామీ మీద తలసాని ముఖ్యమంత్రి వలలో చిక్కుకొన్నాడు. దానికోసం తెలుగుదేశం పార్టీని భ్రష్టుపట్టించే ప్రయత్నం చేశాడు. అయితే సిటీ కాంగ్రెస్ నేతలైన దానం నాగేంద్ర, ముఖేష్ గౌడ్‌లు ఇద్దరూ తలసాని రాకను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. మేయర్ పదవి హామీకి అసలు ఒప్పుకోవడం లేదు. దానితో తలసాని ఆశలకు బ్రేక్ పడింది. మరొకప్రక్క తలసాని వెళ్తే, తాము రావడానికి ఆయన ప్రత్యర్థులు టిఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి సిద్ధమయ్యారు. దీనితో రెండింటికీ చెడ్డ రేవడి అవుతానేమో అని భయపడి, ఫిరాయింపు ఆలోచన మానుకొన్నాడు తలసాని. కానీ ఈలోగా ఆయన వల్ల తెలుగుదేశం పార్టీకి మాత్రం తీవ్ర నష్టం జరిగింది.



మహబూబ్‌నగర్‌కు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఎల్లారెడ్డి ఇప్పుడు ఇదే దారిలో వున్నాడని వినికిడి. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పని చేసిన ఈ సీనియర్ నేతకు వైఎస్ వల విసిరాడు. నాగం జనార్దనరెడ్డి ఒంటెద్దు పోకడతో విసిగిపోయి వున్న ఎల్లారెడ్డి ఈరోజో రేపో చెప్పా పెట్టకుండా పార్టీ వదలి పోయే సూచనలున్నాయి.

అదిలాబాద్‌కు చెందిన మరొక సీనియర్ నేత వేణుగోపాలాచారి సైతం అటే చూస్తున్నాడని సమాచారం. ఇదే జిల్లాకు చెందిన మరొక తెలుగునేత రమేష్ రాథోడ్‌కు పార్టీలో ప్రాధాన్యత పెరగడం వేణుగోపాలాచారిని కష్ట పెడుతున్నది. ఎంతోకాలం నుంచి పార్టీని నమ్ముకొని వున్న తనను పక్కనపెట్టి రమేష్‌రాథోడ్‌కు ఎక్కువ విలువ ఇస్తున్నారని వాపోతున్నారాయన. ఆయన మనసు కనిపెట్టిన ముఖ్యమంత్రి వల

తరువ 14వ పేజీలో

# సహకార ఋణాల స్వాహా!

సైదాపురం సహకార పరపతి సంఘంలో లక్షల రూపాయల దుర్వినియోగం జరిగిందని గగ్గోలురేగుతుంది. జిల్లాలోని కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ప్రభుత్వం అందించిన ఋణ మాఫీ కొందరికిపాలిట వరంగా మారింది అనేందుకు ఈ సంఘటనే నిదర్శనం. సైదాపురం సహకార సంఘంలోని

**సైదాపురంలో వెలుగు చూసిన కుంభకోణం**

కార్యదర్శులు చేతివాటం ప్రదర్శించి ఏకంగా 30 లక్షల రూపాయలు గుటకాయస్వాహా చేశారట. 2001వ సంవత్సరం నుంచి 2006 వరకు ఋణమాఫీ క్రింద 25 లక్షల రూపాయల సొమ్ము కేటాయించగా అప్పనంగా ఆ మొత్తం దిగమింగేశారు. ప్రభుత్వం ప్రకటించిన 5వేల రూపాయల పథకంలో అర్హత లేనివారి పేర్లు వ్రాసి ఆ మొత్తం స్వాహా చేశారు. బ్యాంకు పరిధిలో డి ఫారం పట్టాలకు చెందిన ఋణాలకు రద్దు చేసినా

తొరువ 14వ పేజీలో



జువ్వలదిన్నెలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్విచ్ ఆన్ చేస్తున్న పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. ప్రక్కన మాజీ ఎమ్మెల్యే విష్ణు, ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు తదితరులు.

# ట్రాన్స్‌కోలో ఇంటి దొంగలు!

విద్యుత్‌శాఖ ఉద్యోగస్తుల మధ్య ఏర్పడిన తగాదాలు ఆ శాఖలో కీలకమైన పిఆర్ పుస్తకాలు మాయం చేసేంత వరకు వెళ్లిన ఘటన ఉదయగిరిలో చోటు చేసుకొంది. అక్కడి ఉప విద్యుత్ రెవిన్యూ కార్యాలయంలో పదిరోజుల క్రిందట ఓ అధికారి కీలకమైన క్యాష్ బుక్‌లు, బిల్ కలెక్టర్స్ దఫ్తా పుస్త

**ఉదయగిరిలో పిఆర్ పుస్తకాలు మాయం**

కాలు, పిఆర్ బుక్‌లు మాయం చేయడంతో ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు. దుత్తలూరు, ఉదయగిరి, మర్రిపాడు మండలాలకు సంబంధించిన కీలకమైన పుస్తకాలు కనపడకుండాపోవడం చర్చనీయాంశమైంది. వీటిని అడ్డం పెట్టుకొని లక్షల రూపాయలు గల్లంతు చేసే అవకాశం వుండడంతో ఉన్నతాధికారులు తర్జనభర్జన పడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కార్యాలయంలో కన్పడకుండాపోయిన

తొరువ 14వ పేజీలో

# బుచ్చి మండలాధ్యక్షురాలిగా విజయకుమారి!

ఉత్కంఠభరితంగా జరిగిన బుచ్చి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో రేబాల బిట్-1 ఎంపిటిసి పొణెం విజయకుమారి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. 2001లో జరిగిన మండల పరిషత్ ఎన్నికలలో మొత్తం 21 స్థానాలలో మెజారిటీ స్థానాలు తెలుగుదేశం, సిపిఎం పార్టీలు గెలుచుకొన్నాయి. అప్పట్లో మండలాధ్యక్ష పదవి కాంగ్రెస్‌కు పోకుండా టిడిపి, సిపిఎంలు చెరి రెండున్నరేళ్లు నిర్వహించే విధంగా ఒప్పందం కుదుర్చుకొన్నాయి. దీని ప్రకారం సిపిఎం తరపున దామరమడుగుకు చెందిన కొరిక విజయమ్మ రెండున్నరేళ్లు పాలన చేసిన అనంతరం ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఒప్పందం ప్రకారం తెలుగుదేశం అభ్యర్థి

**సత్తా చూపిన ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి**

ఈ పదవిని చేపట్టాల్సి వుంది. కోవూరు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పరిణామాలతో బుచ్చి ఎంపిపి ఎన్నికలను తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. జడ్పీటిసి గోవర్ధన్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఆ పార్టీకి చెందిన ఎమ్పీటిసిలు కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగకుండా శిబిరాలు నిర్వహించడంతో పాటు బిజెపి ఎంపిటిసి రామిశెట్టి భాస్కర్‌రావు టిడిపికి మద్దతు ఇవ్వడంతో స్వతంత్ర అభ్యర్థి లేబూరు వసంతమ్మ, విజయకుమారిల మధ్య జరిగిన పోటీలో 9-12 ఓట్ల తేడాతో విజయకుమారి ఎన్నికయ్యేలా చూశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి తెలుగుదేశంపార్టీ వదలి వెళ్లినప్పటికి నియోజకవర్గంలో టిడిపికి వచ్చిన ఇబ్బంది ఏదీ లేదన్నారు. ఎక్కడ బెల్లం వుంటే అక్కడ ఈగల్లా వాలడం నల్లపరెడ్లకు అలవాటేనని వ్యాఖ్యానించారు.



నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన అమరవీరుల సంస్మరణ దినోత్సవపు సభలో మాట్లాడుతున్న విరసం నాయకుడు వరవరరావు.



నెల్లూరులో జరిగిన శ్రీశ్రీ శతజయంతి కవి సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సామాజిక ఐక్యవేదిక కన్వీనర్ ఎస్.ఎస్.యాదవ్. ప్రక్కన ఆచార్య ఆదిత్య, కవులు రమణయ్య, మురళీమోహన్‌రాజు.

# పర్యాటకంపై ఎంత ప్రేమో?

అధికారంలో వున్నప్పుడు ప్రజలను ఆకట్టుకొనేందుకు నాయకులు హామీలు గుప్పిస్తుంటారు. అరచేతిలో స్వర్గం చూపెడుతుంటారు. తీరా చేతల్లోకి వచ్చేటప్పటికి ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలవుతుంటాయి అనేందుకు కోడూరు బీచ్ రోడ్డు ఉదాహరణ. తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అక్కడకు వెళ్లే రోడ్డు మాత్రం పరమ అధ్వాన్నంగా వుంది. ఆనాడు తెలుగుదేశంపార్టీ అధికారంలో వున్నప్పుడు మంత్రిగా వున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శాసనసభ్యుడు

**బాగా దెబ్బతిన్న కోడూరు బీచ్ రోడ్డు**

ఆదాల ప్రభాకరరెడ్డి ఈ బీచ్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పదేపదే చెప్పినా పర్యాటక కేంద్రం సంగతి దేవుడెరుగు, కనీసం రోడ్డు నిర్మాణం చేపట్టిన దాఖలాలు కూడా లేవు. హామీలు గుప్పించే ప్రజాప్రతినిధులకు దారుణంగా దెబ్బతిన్నరోడ్లను చూసైనా వాటి నిర్మాణం చేపట్టాలన్న ఆలోచన లేకంటే ప్రజలకు కనీస అవసరాలు

తొరువ 14వ పేజీలో

# గ్రహణాలతో ఇబ్బంది లేదు!

వరుస గ్రహణాల వల్ల ప్రజలకు వచ్చిన ముప్పు ఏమీ లేదని జనవిజ్ఞాన వేదిక స్పష్టం చేస్తున్నది. జూలై 7న చంద్రగ్రహణం, 22న సంపూర్ణ సూర్యగ్రహణం, ఆగస్టు 6న మళ్లీ చంద్రగ్రహణం వస్తున్నాయి. ఇలా వరుసగా గ్రహణాలు రావడం ప్రమాద సంకేతమని అనేక కథనాలు ప్రచారంలో వుండడంతో సామాన్యులు భయపడుతున్నారని, నిజంగా ఎలాంటి ప్రమాదం లేదని జనవిజ్ఞాన వేదిక నాయకుడు కాంతారావు చెప్పున్నారు. క్రీస్తుపూర్వం 3067లో మూడుగ్రహణాలు రావడం వలన కురుక్షేత్ర సంగ్రామం జరిగిందని, 3031లో ఇలాంటి వరుస గ్రహణాలు వచ్చినప్పుడు ద్వారకానగరం నాశనమైందని

**తేల్చి చెప్పిన జనవిజ్ఞాన వేదిక**

ప్రచారం జరగడాన్ని ఆయన ఖండించారు. ఆర్యులు క్రీస్తుపూర్వం 2000 వరకు భారతదేశంలో అడుగుపెట్టలేదని చరిత్రకారులు చెబుతున్నప్పుడు కురుక్షేత్ర సంగ్రామం ఆర్యుల మధ్య ఎలా జరిగిందని ప్రశ్నిస్తున్నారు. అలాగే హరప్పా, మొహంజోదారో, గుజరాత్ నగరాలు క్రీ.పూ 2000 సంవత్సర మధ్యలో నాశనమైనట్లు చెప్తున్నప్పుడు

తొరువ 14వ పేజీలో



నెల్లూరు త్రీ టౌన్ నుంచి ఐదవ పట్టణ ఎస్ఐగా బదిలీ అయిన శ్రీనివాసులురెడ్డిని సత్కరిస్తున్న నగర డిఎస్పీ బాలిరెడ్డి, ప్రక్కన సిఐ వీరాంజనేయరెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసన్.



పెట్రోల్, డీజిల్ ధరల పెంపుకు నిరసనగా నెల్లూరులో సిపిఎం నేతృత్వంలో ప్రదర్శన.

# పన్నులు చెల్లించని ప్రభుత్వ శాఖలు!

## గూడూరు మునిసిపాలిటీలో పేరుకుపోయిన బకాయిలు

గూడూరు మునిసిపాలిటీ అభివృద్ధికి మొండి బకాయిలు అవరోధాలుగా మారుతున్నాయి. ఈ బకాయిలు సైతం ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించినవి కావడం విశేషం. వివిధ ప్రభుత్వశాఖల నుంచి 24లక్షల రూపాయలు బకాయి రూపంలో పేరుకపోయి వున్నాయి. ఈ ప్రభావం మునిసిపాలిటీ సిబ్బందిపై పడింది. వారికి ఆరు నెలలుగా జీతాలు లేని దుస్థితి ఏర్పడింది. మునిసిపాలిటీకి పోలీసు క్వార్టర్ల నుంచి అత్యధికంగా 6,13,144 రూపాయలు ఆర్అండ్‌బి కార్యాలయం నుంచి 3,77,965 ఎస్సీ, ఎస్టీ, బిసి బాలికల వసతిగృహాల నుంచి 2,30,176 రూపాయలు, నేషనల్ హైవే గోడౌన్ల నుంచి 1,80,744, సిరామిక్ కళాశాల నుంచి 1,62,092, ఆస్పత్రి క్వార్టర్ల నుంచి 1,04,860 రూపాయలు వసూలు కావాల్సి వుంది. మునిసిపాలిటీ అభివృద్ధి పథాన ముందుకు వెళ్లాలంటే మొండి బకాయిలను వసూలు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. రెగ్యులర్ సిబ్బంది 140 మంది, కాంట్రాక్టు సిబ్బంది 100 మంది, టైంస్కేలు ఎస్ఎంఆర్‌లు 15 మంది వున్నారు. వీరికి నెలకు జీతాల కోసం 13 లక్షలు చెల్లించాల్సి వుంది. పింఛన్లకు లక్షల్లో చెల్లింపులు చేయాలి. బకాయిలు వసూలు కాకపోవడంతో ఆ ప్రభావం జీతాలపై పడడంతో సిబ్బంది జీతాల కోసం గత ఆరునెలలుగా నిరీక్షించాల్సి వస్తోంది.

### ఉత్తరకాల్వ బాధితులకు పరిహారమెప్పుడు?

జిల్లా రైతాంగానికి వరప్రసాదినిగా వున్న సోమశిల ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న పనులు కాంట్రాక్టర్లను కోటీశ్వరులుగా చేయడం కోసం తప్ప తమ కష్టాలు తీర్చడానికి కాదని రైతాంగం నిట్టూరుస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సాగునీటి సరఫరాకు ఉద్దేశించి నిర్మించిన పెన్నార్ డెల్టా, దక్షిణకాల్వ పరిధిలోని చివరి భూములకు కూడా నీరందేలా డిజైన్ చేసిన అధికారులు ఆరంభం నుండి ఉత్తరకాల్వ రైతుల ప్రయోజనాలపట్ల సవతితల్లి ప్రేమ చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధుల్లో తగిన చొరవ లేకపోవడం వలన తమ బ్రతుకుల్లో మార్పు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఐదేళ్ల క్రిందట అప్పటి కావలి ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ అభ్యర్థన మేరకు మర్రిపాడు మండలం పోలిరెడ్డిపల్లి బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉత్తరకాల్వను ఎఎస్‌పేట, కలిగిరి కొండాపురం మండలాల వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. వెంటనే నిధులు విడుదలై ఉత్తరకాల్వ విస్తరణ పనులు చురుగ్గా ప్రారంభమైన తర్వాత నిలిచిపోయాయి. విస్తరణ సమయంలో రైతుల పట్టాభూముల్లో అడ్డంగా కాల్వలు త్రవ్విన కాంట్రాక్టర్లు తర్వాత అంతూపంతూ లేదు. వెంటనే పరి

తరువాయి 14వ పేజీలో

# ఇందిరమ్మ ఇళ్ల నిధులు హాంఫట్!

ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి ఎంతో ఇష్టమైన పథకం ఇందిరమ్మ పథకం. ఈ పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలకు ఏ మేర ఉపయోగపడ్డాయన్న సంగతి ప్రక్కనబెడితే కాంగ్రెస్ కార్యకర్తలు బాగా ఆరగించారు. అధికారుల తీరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కష్టాలను తెచ్చిపెట్టింది. గృహనిర్మాణశాఖ అధికారులకు కాంగ్రెస్‌పార్టీ

### ఉదయగిరి అధికారుల చేతివాటం

తిరిగి అధికారంలోకి వస్తుందో లేదో అన్న అనుమానంతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అప్పటికే ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించనట్లు రికార్డుల్లో వున్నా వారి పేర్లను అసలు లబ్ధిదారుల జాబితాలోనే లేకుండా రద్దు చేశారు. వారం, వర్జ్యం, ముహూర్తం చూసుకొని ఇంటి నిర్మాణం చేపట్టే ఉదయగిరి వాసులు పునాదులు తీసుకొని గృహనిర్మాణశాఖ అధికారుల వద్దకు వెళ్లి బిల్లు చేయమని అడిగితే అసలు మీకు ఇళ్లే మంజూరు కాలేదని చెప్పడంతో లబ్ధిదారులు ఆశ్చర్యపోతున్నారు. రాజశేఖర్‌రెడ్డి పథకాల వల్లే కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు వేశామని చెప్పుకున్న ఓటర్లు, ఇప్పుడు తమకే దిక్కులేకుండా పోవడంపై ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలను శాపనార్థాలు పెడుతున్నారు.

### రైతుల కోసం ఆన్‌లైన్ బ్యాంకింగ్!

రైతుల వ్యవసాయ రుణాలకు సంబంధించి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని కల్పించారు సిండికేట్ బ్యాంకు అధికారులు. ఆత్మకూరులో గల ఈ బ్యాంకు కార్యాలయంలో రీజనల్ మేనేజర్ డి.రాజనరసయ్య ఈ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ

తరువాయి 14వ పేజీలో

# చెరకు రైతుల చేదు బ్రతుకులు!

జిల్లాలో చెరకు విస్తీర్ణం ఈ ఏడాది తగ్గుముఖం పట్టింది. సరైన గిట్టుబాటు ధర లేక రైతులు చెరకు పండించేందుకు ఆసక్తి కనపరచకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. చివరకు కర్మాగారాలలో గానుగ ఆడేందుకు అవసరమైన చెరకు దొరకడం దుర్లభమయింది. కోవూరు చక్కెర కర్మాగారానికి నాలుగువేల హెక్టార్ల చెరకు సాగు లక్ష్యంగా కాగా, కర్మాగారం అధికారుల ఒత్తిడి మేరకు 1027 హెక్టార్లు

### జిల్లాలో తగ్గిన చెరకు సాగు

సాగయింది. దీంతో 79 వేల టన్నులు మాత్రమే గానుగ ఆడే అవకాశం వుంది. పొదలకూరు చక్కెర కర్మాగారం పరిధిలో 4వేల హెక్టార్ల చెరకుసాగు అవసరం కాగా, 1328 హెక్టార్లు మాత్రమే సాగయింది. లక్షటన్నులు గానుగ ఆడే అవకాశం లభించింది. నాయుడుపేట చక్కెర కర్మాగారం పరిధిలో 1527 హెక్టార్లు మాత్రమే రైతులు చెరకుసాగు చేయడంతో గానుగ ఆడే పరిస్థితి కన్పించడం లేదు. గత సంవత్సరం కోవూరు, పొదలకూరు ప్రాంతంలో టన్ను 1300 రూపాయలు వంతున రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం ఆ ధర రైతులకు గిట్టుబాటు అయ్యేలా లేదు. చెరకు నరికేందుకు కూలీలు దొరకడం లేదు. పొదలకూరు కర్మాగారంలో రెండు, నాయుడుపేటలో ఒక యంత్రం వుంది. సహకార సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న ఫ్యాక్టరీలో అసలు కోత యంత్రమే లేదు. చెరకు అమ్మిన తర్వాత నెలల తరబడి డబ్బుల కోసం ఎదురు చూడాల్సిరావడంతో రైతులు చెరకు పంట సాగుపై దృష్టి పెట్టడం లేదు.

### పనితీరుబట్టి గ్రేడింగ్!

జిల్లాలోని అంగన్‌వాడీ ప్రాజెక్టులకు వాటి పనితీరును బట్టి గ్రేడింగ్ విధానం ప్రకటించనున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శారద తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించేందుకు వచ్చిన ఆమె కోవూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొడవలూరు, విడవలూరులోని అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్త్రీ

తరువాయి 14వ పేజీలో



# తానా సభలకు హాజరై నెల్లూరు కీర్తిని దశదిశల చాటిన వాకాటి నారాయణరెడ్డి!


అమెరికాలో ప్రవాసాంధ్ర ప్రముఖులతో వాకాటి.

జిల్లా కాంగ్రెస్ నాయకులు కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డికి సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో గతంలో ఏ ప్రముఖునికి దక్కని అరుదైన అవకాశం లభించింది. అది అమెరికాలోని చికాగో నగరం రోజ్‌మండ్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు జరిగిన 17వ తానా మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరుకావడం. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ వేణుగోపాల్ రెడ్డితో కలసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజకీయ రంగం, వ్యాపార రంగం, సేవా రంగం ఎందులోనైనా రాణిస్తూ అంచలంచెలుగా ఎదుగుతూ జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్న వ్యక్తి నారాయణరెడ్డి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అన్నీ తానై పార్టీని పటిష్ట పరచడంలో ఆయన చేస్తున్న కృషి అందరి మన్ననలు అందుకొంటున్నది.

## సామాన్య రైతు కుటుంబం

తడ మండలం చేనిగుంట గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు వాకాటి నారాయణరెడ్డి. దుష్యంత్‌రెడ్డి, బుజ్జమ్మల తొలి సంతానమైన ఆయన గూడూరులో విద్యాభ్యాసం పూర్తి చేశారు. గుంతకల్లులో చిన్న రైల్వే కాంట్రాక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించిన వాకాటి ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. మంచి కాంట్రాక్టర్‌గా పేరు పొందారు. ఇండియన్ రైల్వేలో సిగ్నల్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ విభాగంలో తనదైన శైలిలో రాణించి కాంట్రాక్ట్ రంగంలో మొదటి వరుసలో చోటు సంపాదించాడు. అనంతరం విఎన్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీని స్థాపించి అందులోనూ జాతీయ స్థాయిలో పేరు గడించాడు. గ్రామీణ ప్రాంతాలకు, అక్కడి ప్రజలకు పాల వ్యాపారాన్ని అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో దొరవారి సత్రం మండలంలో క్రీమ్ రిచ్ కంపెనీని స్థాపించారు. సూళ్లూరుపేట ప్రజలకు మంచి వినోదాన్ని అందివ్వాలన్న ఆలోచనతో కనకదుర్గ ఎసి సినిమా హాలును నిర్మించిన మొదటి వ్యక్తి వాకాటి.

## ఎన్నో విజయాలు

నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రియ శిష్యునిగా రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన తొలినాళ్లలోనే మండల పరిషత్ పీఠాన్ని కాంగ్రెస్‌కు కైవసం చేసిన నేత. ఆనాటి నుంచి రాజకీయాలలో ఇంతింతై అన్నట్లుగా పలు పదవులను అధిరోహించారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వుంటూ పార్టీని ముందుకు నడిపించిన రథసారథి వాకాటి నారాయణ రెడ్డి. నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏకతాటిపై నడిపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభినందనలు అందుకోవడం ఆయన కృషికి నిదర్శనం. పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ ఆర్థికంగా సహాయసహకారాలు అందిస్తూ చేతిక ఎముకలేని దాతగా పేరు సంపాదించుకొన్నారు. ఆయన సతీమణి లక్ష్మిగీత దాతృత్వంలో భర్తకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ఎంతో మందికి సహాయమందించి వున్నారు.

## డిసిసిబికి పూర్వ వైభవం

జిల్లా రైతాంగానికి కల్పతరువైన కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌కు పూర్వ వైభవం తెచ్చిన వ్యక్తిగా వాకాటి నారాయణ రెడ్డి చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. పీకల్లోతు నష్టాల్లో కూరుకపోయి నిర్జీవంగా మారిన బ్యాంకుకు 2005 సంవత్సరంలో ఛైర్మన్‌గా పగ్గాలు చేపట్టిన ఆయన అనతి కాలంలోనే నష్టాల నుంచి లాభాలబాట పట్టించి అందరిచేత శభాష్ అన్పించుకొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక మార్పులు తీసుకొచ్చారు. బ్యాంకు లాభాలబాటలోకి వచ్చేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దివాలా స్థితికి చేరుకొన్న బ్యాంకును అప్పుల ఊబిలో నుంచి బయటపడేయడంలో సమిష్టికృషి ఉందని వినమ్రంగా చెప్తున్నారు నారాయణరెడ్డి. రైతుబాంధవుడు, జలయజ్ఞప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి ఎంతో ఉందంటున్నారు వాకాటి. ప్రధాని ప్రకటించిన వడ్డీ మాఫీ, రుణమాఫీ పథకాలే బ్యాంకుకు ఊపిరిపోశాయంటున్నారు. డిసిసిబికి అనుబంధంగా వున్న అన్ని సహకార బ్యాంకు శాఖల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించిన ఘనత వాకాటిది. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంకులో 70కోట్లకుపైగా డిపాజిటలు వున్నాయి. బ్యాంకు పరిధిలో 2లక్షల మంది వరకు రైతులు సేవలందుకొంటున్నారు. 2007-08 సంవత్సరంలోనే బంగారుపై 12 కోట్ల రూపాయల రుణాలు అందజేసి రికార్డు నెలకొల్పారు. ఇంతటి విజయాలను స్వంతం చేసుకోవడం వల్లనే చేనిగుంట నుంచి అమెరికా వరకు ఆయన ప్రజాసేవకు సముచిత స్థానం లభించింది.


సహకార బ్యాంక్ వార్షికోత్సవ సంబరాల్లో మంత్రితో వాకాటి.


అమెరికా రాజకీయ ప్రముఖులతో వాకాటి.


అమెరికాలో మన రాష్ట్ర ప్రముఖులతో వాకాటి.




## ప్రేమించమని రౌడీల వేధింపులు!



రౌడీయిజాన్ని హీరోయిజంగా భావించిన కొందరు అమాయక యువతులు రౌడీషీటర్లను ప్రేమించి పెళ్లి చేసుకొంటున్నారు. కాలక్రమేణా అసలు నిజాలు తెలిసేసరికి వారి జీవితాలు సర్వనాశనమై పోతున్నాయి. గతవారం

### యాసిన్ హత్యలో వెలుగుచూసిన కొత్తకోణం

చేపల మార్కెట్ సెంటర్‌లో హత్యకుగురైన యాసిన్ ఏడాది క్రితం ఓ యువతిని ప్రేమించి వారి తల్లిదండ్రులకు తెలియకుండానే ఇంటి నుంచి తీసుకెళ్లి వివాహం చేసుకొన్నాడు. ప్రస్తుతం ఈమె నిండు చూలాలు. నూరేళ్లపాటు భర్త తోడుగా వుంటాడని విశ్వసించిన ఈమె అతడు కిరాతకంగా హత్యకు గురవ్వడంతో ఖిన్నురాలైంది. కుమార్తె జీవితాన్ని తలచుకొని ఆమె తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో కన్నీరు మున్నీరవడం చూసినవారిని ఆలోచింపజేసింది. యువతులు ప్రేమించవచ్చు. కాని ఎదుటివారు ఎటువంటి వారో చూసుకొని అడుగు ముందుకు వేయడం మంచిది. నగరంలోని రౌడీషీటర్లు కొందరు అమ్మాయిలను ప్రేమించమని లేకుంటే వారితోపాటు తల్లిదండ్రులను చంపేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇటువంటి రౌడీషీటర్ల పని పట్టాల్సిన అదనపు బాధ్యత పోలీసులపైనే వుంది.




## అవినీతి బాటన ట్రాఫిక్ పోలీసులు!

నెల్లూరు నగరంలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేసే పోలీసులు డ్యూటీ చేయడం కన్నా అక్రమార్జన మీదే దృష్టి మహాబాగా మళ్లించి వున్నారు. ట్రాఫిక్ పోలీసుల రోజువారీ సంపాదన వందల్లో వుంటే ఎస్ఐల సంపాదన వేలల్లో వుంటుంది. ట్రాఫిక్ పెద్దగాలేని వేళల్లో కానిస్టేబుళ్లు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ఇసుక లారీల నుంచి పబ్లిక్‌గానే డబ్బులు గుంజేస్తున్నారు. ట్రాఫిక్ వేళల్లో ఎస్ఐలు తనిఖీల పేరిట వాహనాలను ఆపి ఏవేవో కాగితాలు అడుగుతారు. లేవని చెప్పగానే వందల్లో చలానాలు రాస్తున్నట్లు ఫోజులిస్తారు. వీటికి భయపడ్డ ద్విచక్రవాహనదారులు రెండువందలకు తగ్గకుండా, ఆటోలవాళ్లు 400 రూపాయలకు తగ్గకుండా ఎస్ఐ చేతిలో పెడితేనే వారిని వదులుతున్నారు. చలనా వ్రాసి డబ్బు చెల్లించని వాహనాలను ట్రాఫిక్ పోలీ

### ట్రాఫిక్ సరిచేయను తీరికలేదు!

సులు ఆత్మకూరు బస్టాండ్ వద్దగల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వుంచుతున్నారు. వీటిని తిరిగి తెచ్చుకోను వెళ్లినవారిని ఇక్కడి సిబ్బంది చేతులు తడపనిదే వాహనాలు ఇవ్వడం లేదు. నగరంలో పనిచేసే ఆరుమంది ట్రాఫిక్ ఎస్ఐలు మొత్తం మీద చలానాలు వ్రాసి 20వేలు, వ్రాయకుండా 40వేలు ప్రతినిత్యం సంపాదిస్తున్నారు. ఈ మొత్తమే కాకుండా టౌన్‌బస్సుల ఓనర్లు నెలమామూలుగా మూడు లక్షల రూపాయలు ట్రాఫిక్ పోలీసులకు అందజేస్తున్నారు. నగరంలోని వివిధ వ్యాపారసంస్థల నిర్వాహకుల వద్ద నుంచి కూడా ట్రాఫిక్ పోలీసులకు నెలసరి ఐదు లక్షలు అందుతున్నట్లు తెలిసింది. మామూళ్ల మత్తులో పడిన ట్రాఫిక్ పోలీసులు నగర ట్రాఫిక్ అబందరగా మారినా పట్టించుకోకుండా తమ సంపాదనలో తాము మునిగి తేలుతున్నారు.



## ఆసుపత్రిలో ఆత్మహత్య!

అనారోగ్యానికి తోడు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుండడం తట్టుకోలేని ఓ ఆర్ఎంపి డాక్టర్ చికిత్స చేయించుకోను చేరిన హాస్పిటల్‌లోనే 6తేది ఉరివేసుకొని మరణించడం సంచలనం సృష్టించింది. నెల్లూరు పొదలకూరురోడ్డులోని శాంతినగర్‌కు చెందిన

### అనారోగ్యానికి తోడైన ఆర్థిక ఇబ్బందులు

ఆర్ఎంపి డాక్టర్ మారం ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది క్రితం ఇతనికి గుండెజబ్బు బయటపడింది. దీంతో అప్పులు చేసి ఆపరేషన్ చేయించుకొన్నాడు. దీని తర్వాత అనారోగ్య సమస్యలు ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే వుండినాయి. రెండు రోజుల క్రితం వాంతులు, విరోచనాలు అవడంతో పొగతోటలోని ఒక హాస్పిటల్‌లో చేరారాయన. వైద్యపరీక్షల్లో కిడ్నీలు కూడా చెడిపోయినట్లు తెలిసింది. దీంతో బాగా కుంగిపోయాడు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు అతన్ని చెన్నైకు వెళ్లమన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అవను బంధువుల వద్దకు వెళ్లి భార్యను డబ్బులు తెమ్మన్న ప్రసాద్ ఆస్పత్రి గదిలోని ఫ్యానుకు ఉరివేసుకొని మరణించాడు. అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చి ఆదుకొంటున్నామని చెప్పే ప్రభుత్వ పెద్దలు, అధికారులు ప్రసాద్ వంటి సామాన్యుడికి అది ఎందుకు అందలేదో విచారణకు ఆదేశిస్తే బాగుంటుంది.

## సేవాగుణాన్ని అలవర్చుకోవాలి!



తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలందజేస్తున్న ఎమ్మెల్సీ మల్లారెడ్డి. ప్రక్కన డాక్టర్ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, పుట్టా రామకృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ

తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా గురు సన్మానం, విద్యాప్రోత్సాహకాల కార్యక్రమం 5వ తేది జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి పాల్గొన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తున్న టివిఎస్ సత్రం నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవరచుకోవాలని, మంచి మనసు కల్గి వుండాలని ఎమ్మెల్సీ మల్లారెడ్డి అభిలషించారు. సత్రం మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు మరింత సేవ చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే బ్రాహ్మణుల కోసం ప్రత్యేక గదిని కేటాయించామన్నారు. మరణించిన వారిని వుంచేందుకు సత్రంలోనే ఒక గదిని నిర్మిస్తున్నట్లు

### తిప్పరాజు వెంకట సుబ్బయ్య సత్రం అవార్డుల ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్సీ సూచన

తెలిపారు. అనంతరం వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ ఉదాలి సీతారాం, డాక్టర్ న్యాపతి రామచంద్రరావు, ప్రఖ్యాత న్యాయవాది చింతా శ్రీరామమూర్తిని ఘనంగా సన్మానించారు. అలాగే ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థులకు పదివేల రూపాయలు, ఎంసిఏ, ఐసిడబ్ల్యుఏ చదువుతున్న వారికి 7,200 రూపాయలు, డిగ్రీ, ఇంటర్ చదివే పిల్లలకు 3 వేల రూపాయలు, పదవ తరగతి విద్యార్థులకు 1,116 లెక్కన లక్షా అరవై వేల రూపాయలను 60 మందికి పంపిణీ చేశారు.

### జూనియర్ ఎన్టీఆర్‌ను కలసిన శింగంశెట్టి!

జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షుడు శింగంశెట్టి రవిచంద్ర గత వారం హైదరాబాద్‌లో జూనియర్ ఎన్టీఆర్‌ను కలసి తమ సమితి ద్వారా

తరువాయి 14వ పేజీలో

# ఉత్తరక్రియలు

జననం 7.2.1951



మరణం 6.7.2009

మా ఇంటి దీపం

## శ్రీమతి జక్కా సౌదామిని

తే.06.07.09ది, సోమవారం పరమపదించినారు.

### ఉత్తరక్రియలు

తే.18.07.09ది, శనివారం ఉదయం 11.00 గంటలకు, ఎన్‌డికె కళ్యాణ మందిర, 13వ మెయిన్, 100 ఫీట్‌రోడ్డు, ఇందిరానగర్, H.A.L 2వ స్టేజీ, బెంగుళూరు - 560 008 నందు జరుగును.

బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

భర్త: జక్కా శ్రీనివాసులరెడ్డి
(జె.యస్.రెడ్డి)
మరియు కుటుంబసభ్యులు

డోరు నెం.318,100 ఫీట్‌రోడ్డు, ఇందిరానగర్ 1వ స్టేజీ, బెంగుళూరు. ఫోన్స్: 09448075652, 09440279212, 09246567000.

